


— ఐ.ఎ.నరసింహం

అది ఫిబ్రవరి నెల చివరి రోజులు.

ఏజన్సీ ప్రాంతంలో విస్తారంగా పండిన చింతపండును గిరిజనులు కార్పొరేషన్‌కి అమ్మకానికి తెస్తారు. అలా తెస్తున్నపుడు దారిలోనే బేరం కుదిరితే కొంత మందికి ఆ సరుకును అమ్మేసి వెళ్ళిపోతారు.

పద్మనాభానికి ఆ ప్రాంతంలోనే వుద్యోగం. వారం క్రితం తన మిత్రుడికి పెళ్ళి కుదిరిందని కొంత చింతపండును పంపమని వుత్తరం రాశాడు.

ఆ రోజు —

ఉదయం తొమ్మిది గంటలైంది. ఊరికి కొంచెం దూరంలో ఓ చెట్టు దగ్గర నిలబడ్డాడు పద్మనాభం.

సరిగ్గా అప్పుడే —

ఒక కావిడతో ఓ గిరిజనుడు అటుగా చింత పండు తెస్తూ కనిపించాడు.

పద్మనాభం అతడిని సమీపించి — "ఏమయ్యోయ్ చింతపండు అమ్ముతావా?" అన్నాడు.

అతడు పలకలేదు. కావిడను కీచు కీచులాడించుకుంటూ నడుస్తూనే వున్నాడు.

"ఇదిగో నిన్నే — ఆ కావిడెంతో చెప్పు" అన్నాడు పద్మనాభం ఆశగా.

"నానమ్మను. తూనిక తెల్దు" అన్నాడా గిరిజనుడు నడుస్తూనే.

"సరేలే. నేను అంచనా మీద చెప్తాను. నచ్చితేనే యియ్యి" అన్నాడు పద్మనాభం అతడి వెంట పరుగెడుతూ.

ఆ వ్యక్తి ఆగాడు. కావిడ దించాడు.

వెంటనే పద్మనాభం కావిడలో ఒక్కో బుట్ట పైకెత్తి దించి, రెండు బుట్టల్లో సరుకు ఓ యాభై కేజీలకు పైబడే వుండొచ్చు. ఇప్పటి రేటు ప్రకారం నూట యాభై రూపాయిలకు తక్కువివ్వడేమో అనుకున్నాడు మనసులో. తరువాత నెమ్మదిగా —

"యాభై రూపాయలిస్తాను — యిస్తావా?" అన్నాడు.

"లేదూ" రెండవ అక్షరానికి వుండకూడని దీర్ఘాన్ని పెట్టి అన్నాడా గిరిజనుడు.

పద్మనాభం పాచిక పారలేదని బాధపడ్డాడు.

"సరే అరవై ఇస్తాను" అన్నాడు మళ్ళీ.

"నానమ్మను" అతడు కావడి బద్ద మీదకెత్తి తల దూర్చిపోయాడు.

తన అవసరాన్ని ఆ సరుకు నాణ్యతను గుర్తించి "సరే మరో పది పెంచుతున్నాను. నీకు నచ్చితేనే యియ్యి" పద్మనాభం రెండోసారి దీనంగా అడిగాడు.

ఆ వ్యక్తి ఒకసారి ఆలోచించి —

"నానమ్మను" అని మరోసారి చెప్పి కార్పొరేషన్‌కి దారితీశాడు.

"మనమేదన్నా సరుకు కొనాలనుకుంటే కార్పొరేషన్‌లో అమ్ముతుండగా ఆ సేల్స్‌మన్‌కి కొంచం రిక్వెస్ట్ చేసి చెప్తే మనకా సరుకు యిచ్చేస్తారోయ్" ఒకసారి స్థానిక మిత్రుడన్న మాటలు గుర్తుకొచ్చాయి.

అంతే —

మళ్ళీ అతడి వెంటపడ్డాడు పద్మనాభం.

ఆ సరుకు చెక్క కాటాలో పెట్టి తూనిక రాళ్ళున్న చెక్క మీద ఎడమ కాలిని రెండవ ప్రక్కనున్న చెక్క ఇనుప గొలుసు మీద కుడి చేతిని పెట్టి సరుకు తూనిక వేసి ఓ ఎనభై రూపాయిలకు అతడి చేతిలో ఓ ఎర్ర బిల్లు పెట్టి డిపోలో డబ్బులు తీసుకోమని చెప్పాడు సేల్స్‌మన్.

పద్మనాభం అంతా గమనిస్తూనే ఆశ్చర్యపోయాడు. సేల్స్‌మన్ తూనికలో చూపిన చతురతకి అవాక్కయిపోయాడు. తరువాత ఆ సరుకు తనకే ఇవ్వబోతున్నాడన్న సంగతి తెలిసి ఎంతో సంబరపడిపోయాడు.

ఓ పది నిమిషాల తరువాత కాబోలు —

పద్మనాభం అభ్యర్థన మేరకు "సరే డబ్బు తెండి" అన్నాడు సేల్స్‌మన్.

ఎనభై రూపాయిలను అతడి చేతిలో పెట్టాడు పద్మనాభం.

"ఇదేమిటి? నూటా ఎనభై యివ్వండి! ఆ సరుకు అరవై కేజీలు" అన్నాడు సేల్స్‌మన్.

పద్మనాభం కంగుతిన్నాడు. ఓ రెండునిమిషాల తరువాత కాబోలు — "మరి అతడికి మీరు ఎనభై రూపాయిలకే బిల్లిచ్చారు కదా" అన్నాడు అమాయకంగా.

"అదంతా మీ కనవసరం. అసలీ సరుకు ఇలా అమ్మకూడదు. మీరెంతో అవసరానికి అడిగారు కదాని కాదనలేకపోయాను. మీకీ సరుకు కావాలో వద్దో త్వరగా చెప్పండి" అన్నాడు సేల్స్‌మన్ హడావుడిగా — మళ్ళీ కాటాలో కాలు పెడుతూ.

అప్పుడర్థమయింది పద్మనాభానికి —

కాలూ చెయ్యి కాటా మీదుంచితే కొనడం, అది తీసి సరుకు తూచితే పైవాళ్ళకు అమ్మడం అని.

అప్పటికప్పుడు ఏమీ తేల్చుకోలేకపోయాడు. ఆ గిరిజనుడి వంక చూశాడు జాలిగా.

అతడి ముఖం ప్రసన్నంగానే వుంది. తన ముఖమే నల్లగా మాడిపోయినట్టయింది.

(ఈ కత ఎవర్నీ ఉద్దేశించి రాసింది కాదని మనవి)

◆